### ఇక్కడ కొన్నది సగం ధాన్యమే..

ఇది కొత్తపల్లి మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం. ఈ కేంద్రంలో గతేడాది వాన కాలంతో పోల్చితే ఇప్పుడు ధాన్యం కొనుగోలు 50 శాతం మాత్రమే జరిగింది. 2022లో 13,070 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేసిన ఈ కేంద్రంలో ఈ సారి ఇప్పటి వరకు 7,240 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయగలిగారు. ఇంకో వెయ్యి క్వింటాళ్ల వరకు కేంద్రంలో ఉన్నాయి. ఆలస్యంగా వరి నాట్లు వేసిన ఇంకొందరు రైతులు ఇప్పుడిప్పుడే కోతలు నిర్వహిస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఇంకో 500 క్వింటాళ్ల వరకు ధాన్యం వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎంత చేసినా 9వేల క్వింటాళ్లకు మించి ఇక్కడ కొనుగోళ్లు జరిగే అవకాశం కనిపించడం లేదు. గతానికి ఇప్పటికే పోల్చుకుంటే కేంద్రం ప్రారంభించకముందే కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. అంతే కాకుండా గ్రామంలో వరికి వచ్చిన తెగుళ్ల కారణంగా గతేడాదికి ఇప్పటికీ దిగుబడి పెద్ద మొత్తంలో పడిపోయింది.



కొత్తపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న మహిళా రైతు బక్కవ్వ

# కొనుగోళ్లలో తప్పిన అంచనా

- సెంటర్లకు తగ్గిన ధాన్యం రాక
- 4 లక్షల మెట్రిక్ టన్నులు అనుకుంటే వచ్చింది సగమే..
- ఇప్పటివరకు కొన్నది 2.13 లక్షల మెట్రిక్ టన్నులే
- ప్రైవేట్ వ్యాపారులు కొనడం, దిగుబడి తగ్గడమే కారణం..?



కొత్తపల్లి కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు..

కరీంనగర్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లు ఆశించిన రీతిలో జరుగలేదు. కొనుగోళ్లకు ముందు అధికారులు జిల్లాలో ఎంత వరి సాగైంది. ఎకరాకు ఎంత దిగుబడి వచ్చే అవకాశం ఉందనేది అంచనా వేసి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకుంటారు. గత వానకాలం సీజన్‌లో జిల్లాలో 2.72 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఫలితంగా 6 లక్షల మెట్రిక్ టన్నులకు మించి దిగుబడి రావచ్చని భావించిన అధికారులు, 4 లక్షల మెట్రిక్ టన్నులు మార్కెటింగ్ జరుగవచ్చని అంచనా వేశారు. ప్రతిసారి అక్టోబర్ చివరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. నవంబర్‌లో పుంజుకుని, డిసెంబర్‌లో మొదటి లేదా రెండో వారంలో కొనుగోళ్లు ముగిసేవి. అయితే ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో అధికారులు ఎక్కువగా ఈ పనిలోనే నిమగ్నమై ఉన్నారు. ఏ కొద్ది సమయం చిక్కినా కొనుగోళ్లపై దృష్టి సారించారు. జిల్లాలో 324 కేంద్రాలను ప్రారంభించారు. అధికారులు కొనుగోళ్ల విషయంలో ఎక్కడా లోపాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఫలితంగా ఇప్పటి వరకు 2.13 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కొనుగోళ్లు చేశారు. అధికారులు తదుపరి వేసిన అంచనాల ప్రకారం 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కొనుగోళ్లు మందగించిన నేపథ్యంలో తెరిచిన 324 కేంద్రాల్లో ఇప్పటికే 180 కేంద్రాలు మూసేశారు. మరో నాలుగైదు రోజుల్లో మిగతా కేంద్రాలను కూడా మూసివేసే ఆలోచనలో అధికారులు కనిపిస్తున్నారు.

### 2.13 లక్షల మెట్రిక్ టన్నులు..

జిల్లాలో ఇప్పటి వరకు వానకాలం సీజన్‌లో వచ్చిన ధాన్యం దిగుబడిలో 2.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దీని విలువ రూ.470.65 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. ఐకేపీ ద్వారా 50 కేంద్రాలు తెరిచి 6,310 మంది రైతుల నుంచి 31,502.800, ప్యాక్స్ కేంద్రాల ద్వారా 233 కేంద్రాలు తెరిచి 32,560 మంది రైతుల నుంచి 1,55,356.162, డీసీఎంఎస్ ద్వారా 46 కేంద్రాలు తెరిచి 24,935.740, హాకా ద్వారా 3 కేంద్రాలు తెరిచి 1,849.160 మెట్రిక్ టన్నుల చొప్పున 2,13,644.312 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీని విలువ మొత్తం రూ.470.65 కోట్లు కాగా ఇప్పటికే రూ.458.45 కోట్లు అప్‌లోడ్ చేశారు. రూ.439.81 కోట్లకు ట్రక్‌షీట్ జనరేట్ చేశారు. రూ.424.82 కోట్లు మిల్లర్ల నుంచి సేకరించారు. ఇందులో రూ.401.91 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. విడుదలైన నగదులో ఇంకా రూ.22.91 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. కాగా, ఎప్పటి ధాన్యాన్ని అపుడు తరలించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు సేకరించిన 2,13,644 మెట్రిక్ టన్నుల్లో 2,13,587 మెట్రిక్ టన్నులు తరలించారు. ఇంకా కేవలం 56.540 మెట్రిక్ టన్నులు మాత్రమే తరలించాల్సి ఉంది.



కురిక్యాలలో లారీ కోసం ఎదురు చూస్తున్న హమాలీలు..

### వరి నిన్ననే కోసినం..

వరి నిన్ననే కోసినం. రెండు మూడు రోజులకు ఎండుతయచ్చు. మా ఊళ్లె రెండు కేంద్రాలు పెట్టిన్రు. ఇంకో కేంద్రంల సుతం వడ్లమ్మినం. ఎన్కశీరి నాటేత్తే కోతలు సుతం ఎన్కకైనయ్. మా పొలం ఇంకింత కోతకున్నది. రేపటెల్లుండి కోత్తం. మా వడ్లు అయింత కేంద్రానికి వచ్చేదాక ఉంచుతరో లేదో..? అందుకనే వడ్లు ఇక్కన్నే ఎండబోసినం. ఇంకింత కోతయ్యేదాక కేంద్రం ఉంచాలే. ఈ వడ్లన్నీ ఏడికివోయి అమ్ముకుంటం.

- పుల్ల బక్కవ్వ, కొత్తపల్లి రైతు.

### ప్రవేట్ల మస్తుగ అమ్మిన్రు..



ఈ సారి మా ఊళ్లె ప్రవేట్లను బగ్గ మంది అమ్మిన్రు. కోతలు సురువైనపుడు మిల్లర్లు వచ్చి పచ్చి వడ్లే కొనుక్కపోయిన్రు. అప్పటికింకా కేంద్రం ఇస్టాట్‌గాలే. రేటు కేంద్రంల పెట్టినట్లు ఎందుకు పెడ్తరు. కింటల్‌కు పద్దెనిమిది, పదిహేడు వందలట్ల పెట్టి కొన్నరు. పచ్చి వడ్లే కొనిరి బరువు వత్తయిగదా. కేంద్రం రేటు పెడ్తే వాళ్లు లాసుగారా. అంతకంతే నయమని మా రైతులు సుత ఎగవడి ఎగవడి అమ్మిన్రు. ఎవ్వలూ బాధపడలే.

- ఒగ్గరి జగన్, కొత్తపల్లి రైతు.

### ఎండె వరకే పది రోజులైంది..



పది రోజుల కిందనే వరి కోసినం. పర్దలు లేకుండె. కిందనే కుప్పవోసి ఉంచినం. వాన పడ్డపుడు కవర్లు కప్పి పెట్టినం. ఎండ గొట్టినంక ఎండవోసినం. జెర్రంత గల్లర గల్లర అయినంక ఇయ్యాలనే జోకుతన్రు. వరి కొంచెం నాటేసుడు ఎన్కకయ్యింది. కోతలు సుతం ఎన్కకయ్యేవరకు కేంద్రం ఉంటదో లేదో అనుకున్నం. మా ఊళ్లె చాన మందే ఎన్కకు ఏసిన్రు. ఇంకా కోతలైతన్నయ్. చాన్దినాలే కేంద్రం ఉంచిన్రు.

- ఎగుర్ల పద్మ, కొత్తపల్లి రైతు.

### ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు..

జిల్లాలో సాధారణంగా దొడ్డు రకం వడ్లను ఎక్కువగా సాగు చేస్తారు. హుజూరాబాద్ డివిజన్‌లో విత్తనోత్పత్తికి ప్రాధాన్యత ఇస్తారు. ఈ నేపథ్యంలో 2.72 లక్షల ఎకరాల్లో వరి సాగైనపుడు ఎకరానికి 25 క్వింటాళ్లు అంచనా వేసినా 6 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇందులో తిండి కోసం, సన్న రకం వడ్లు, విత్తనోత్పత్తి తీసేస్తే అధికారులు ముందుగా అంచనా వేసినట్లు 4 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉండేది. కానీ ఈ సారి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లు విరివిగా జరిపారు. కొతలు కోస్తుండగానే పొలాల వద్ద నుంచే పచ్చి ధాన్యాన్ని మిల్లులకు తరలించుకెళ్లారు. ప్రైవేట్ వ్యాపారులు పొలం వద్దకు వచ్చి కొనుగోళ్లు చేసుకున్న నేపథ్యంలో రైతులు ధర విషయం ఆలోచించ లేదు. క్వింటాల్‌కు రూ.1,750 నుంచి రూ.1,900 చెల్లించినా సంతోషంగా అప్పగించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అయితే ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున కనీస మద్దతు ధర చెల్లిస్తున్నారు. అయితే ధాన్యం కల్లాల్లో ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉంటుందని భావించిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ పనంతా లేకుండా చాలా మంది వ్యాపారులు పచ్చి వడ్లనే కొనుగోలు చేయడంతో తక్కువ ధరకైనా రైతులు విక్రయించినట్లు తెలుస్తోంది.

## పంట రక్షణకు నయా బెదురు



ఓదెల: పొత్కపల్లిలో మిర్చి పంట వద్ద మనిషిని పోలిన బొమ్మ

ఓదెల, డిసెంబర్ 15: రైతులు తమ పంటలను పక్షులు, అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు బెదురుగా అనేక వస్తువులను పెడుతుంటారు. కానీ ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలోని రైతు మాత్రం సరికొత్తగా ఆలోచించాడు. అచ్చం మనిషిని పోలిఉన్న బొమ్మను తన మిర్చి తోట వద్ద ఏర్పాటు చేశాడు. తలకు హెల్మెట్ కూడా అమర్చాడు. అప్పటి నుంచి పక్షులు, అటవీ జంతువుల బాధ బెడద తప్పిందని సదరు రైతు చెబుతున్నాడు. కాగా రాత్రి పూట అటుగా వెళ్లే వారు ఆ బొమ్మను చూసి మనిషేనని భ్రమపడుతున్నారని అంటున్నాడు.

## కిటకిటలాడిన రాజన్న క్షేత్రం

- ఎనిమిది వేల మంది భక్తుల రాక

వేములవాడ టౌన్ , డిసెంబర్ 15 : వేములవాడ రాజన్న ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. గురువారం రాత్రే రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజామున పవిత్ర గుండంలో పుణ్య స్నానాలు చేశారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. క్యూలైన్ల గుండా వెళ్లి రాయేశుడిని దర్శించుకున్నారు. అభిషేక, అన్న, ఆకుల, కుంకుమపూజలు, పల్లకీ సేవలు, కల్యాణాల మొక్కులు, సత్యనారాయణవ్రతాలు, చండీహోమాల మొక్కులు తీర్చుకున్నారు. రాజన్నను దాదాపు 8 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.



క్యూలో స్వామి వారి దర్శనం కోసం నిలబడ్డ భక్తులు

### ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఆర్జిత సేవలు రద్దు

సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో రానుండగా, ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు సహకరించాలని కోరారు.

# జీఎస్టీ బోగస్ బిల్లుల కుంభకోణం ₹300 కోట్లు?



- జగిత్యాల కేంద్రంగా భారీ దందా
- విచారణలో విస్తు పోయే నిజాలు
- తవ్విన కొద్దీ రూ.కోట్లలో అక్రమాలు
- చంద సాయితోపాటు పలువురు అదుపులోకి
- ఇప్పటికే 30 ఫేక్ ఖాతాల గుర్తింపు
- వివిధ జిల్లాలకూ బోగస్ బిల్లుల వ్యవహారం
- మరింతగా లోతుగా పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జగిత్యాల జిల్లా కేంద్రంగా జరిగిన జీఎస్టీ బోగస్ బిల్లుల వ్యవహారంలో బైర్లు కమ్మే నిజాలు బహిర్గతమవుతున్నాయి. తవ్వినకొద్దీ రూ.కోట్లలో అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఒకటి రెండు కాదు, ఏకంగా ఇప్పటికే ₹300 కోట్ల వరకు ఈ బోగస్ బిల్లుల దందా జరిగినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, లోతుగా తవ్వుతున్న కొద్దీ అధికారులే విస్తుపోయే విషయాలు బయటపడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిజానికి ఈ వ్యవహారంలో జగిత్యాలకు చెందిన చంద సాయి అనే వ్యక్తిని ప్రధాన సూత్రధారుడిగా భావిస్తున్నారు. అతను గతంలో జగిత్యాలలోని ఒక టాక్స్ కన్సల్టెంట్ వద్ద పనిచేసి, అక్కడి నుంచి వెళ్లిపోయి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ టాక్స్ కన్సల్టెంట్ వద్ద పనిచేస్తున్నట్లుగా తెలుస్తున్నది. పలు ఫర్మ్‌ల పేరిట ఈ దందా నడుపుతున్నట్లుగా గుర్తించారు. కన్సల్టెంట్ల వద్దకు ఫర్మ్ క్లోజింగ్‌కు వచ్చే వారిని గుర్తించి, సదరు ఫోన్‌నంబర్లు, మెయిల్ ఐడీలు మార్చి.. ఈ దందా సాగిస్తున్నారని తేల్చారు. ఇప్పటికే ప్రాథమికంగా 30 ఫేక్ ఖాతాల్లో లావాదేవీలు జరిగినట్టు గుర్తించడంతోపాటు పూర్తి విచారణ చేస్తున్నారు. లక్షల్లో జీఎస్టీ చెల్లించాల్సి వచ్చిన వారికి బోగస్ టాక్స్ ఇన్‌వాయిస్ (బిల్లులు)లు ఇస్తూ పెద్ద దందా నడిపినట్టు తెలుస్తున్నది. జీఎస్టీ చెల్లించకుండా ఉండేందుకు కొంత మంది ట్రేడర్లు, కాంట్రాక్టర్లు వంటి వివిధ వర్గాలకు ఈ బిల్లులు ఉపయోగపడుతుండగా, మరి కొంత మంది ఈ బోగస్ బిల్లులు పెట్టి డబ్బులను ప్రభుత్వం నుంచి క్లెయిం కూడా చేసినట్టుగా తెలుస్తున్నది.





### ఒక్కరే చేశారా..?

తాజాగా అందుతున్న వివరాలను చూస్తే.. ఈ బోగస్ బిల్లుల దందా దాదాపు ₹300 కోట్లవరకు ఉందని తెలుస్తున్నది. అంతేకాదు, ఒకే ఫర్మ్ పేరిట దాదాపు ₹90 కోట్ల వ్యవహారం నడిచినట్టుగా సమాచారం అందుతున్నది. అయితే ఈ వ్యవహారంలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న చంద సాయితోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని వివరాలు సేకరించడమే కాదు, మరికొంత మందిని సైతం అదుపులోకి తీసుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. అయితే చందసాయి అనే ఒకే వ్యక్తి దందా నడుపడం సాధ్యం కాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒక అధికారి హస్తం ఉందన్న సందేహాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ దిశగా సైతం అధికారులు విచారణ చేస్తున్నట్టుగా తెలుస్తున్నది. ఎక్కడా లేని విధంగా ఒక్క జగిత్యాలలో ఇంత పెద్ద బోగస్ బిల్లుల దందా నడువడం, ఇది ఉన్నత స్థాయి అధికారులు గుర్తించే వరకు కింది స్థాయి అధికారులు గుర్తించకపోవడం చూస్తే అనేక సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఒక అధికారి కొంత మంది ఆడిటర్లతో కుమ్మక్కై ఈ దందాకు పరోక్షంగా సహకరించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఒక వైపు విచారణ చేస్తున్న అధికారులు, మరోవైపు ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని హైదరాబాద్ అధికారులకు అందిస్తున్నట్టుగా తెలుస్తున్నది. ఈ విషయంపై కరీంనగర్ డివిజన్ సంయుక్త అధికారి రవికుమార్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా, ఇంకా విచారణ కొనసాగుతున్నదని చెప్పారు. ఇప్పుడే ఏమీ జరిగిందన్న విషయాన్ని పూర్తిగా చెప్పలేమని, వివరాలు పూర్తిగా బయటకు రావడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. తప్పు చేసిన వారిపై చర్యలు తప్పకుండా ఉంటాయని స్పష్టం చేశారు.






# ఆటో డ్రైవర్ల ఆందోళన బాట

- సిరిసిల్లలో వందలాది ఆటోలతో ర్యాలీ
- సర్కారు మా పొట్టకొట్టిందంటూ ఆవేదన
- ప్రతినెలా జీవన భృతి ₹10వేలు ఇవ్వాలని డిమాండ్



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ర్యాలీగా వస్తున్న ఆటో కార్మికులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో తమ ఉపాధి దెబ్బతిన్నదంటూ ఆటోడ్రైవర్లు మండిపడ్డారు. తమ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సిరిసిల్ల జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్ని మండలాలకు చెందిన వందలాది మంది ఆటో డ్రైవర్లు ఆటోలతో శుక్రవారం జిల్లా కేంద్రానికి తరలివచ్చి ఆందోళన చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్, నేతన్న, గాంధీచౌరస్తాల మీదుగా కలెక్టరేట్ దాకా భారీ నిరసన ర్యాలీ తీశారు. తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలంటూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బొల్లి రాంమోహన్, అధ్యక్షుడు పులినాగరాజు మాట్లాడుతూ తాము డిగ్రీలు చదువుకున్న ఉద్యోగాలు దొరక్క ఆటోలు నడుపుకుంటూ జీవనం గడిస్తున్నామన్నారు. రోజుకు ₹500 సంపాదించే మాకు కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల కనీసం ₹100 కూడా సంపాదన రావడం లేదన్నారు. ఫైనాన్స్‌లో అప్పు తీసుకుని ఆటోలు కొనుక్కున్నామని, నెలనెలా ఈఎంఐ కట్టలేని పరిస్థితి ఉండగా, కుటుంబ పోషణ భారమై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, ప్రతినెల జీవన భృతి ₹10వేలు, ప్రతి ఆటో డ్రైవర్‌కు జీవిత బీమా ₹5లక్షలు పాలసీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకుంటే మాకు ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. సర్కారు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ అల్లె శ్రీనివాస్, బాపురెడ్డి, మల్లేశం, కరీం, బండి సాయి కుమార్, రవి, అంజయ్య, హరీశ్ ఉన్నారు.